క్లుప్తంగా

కాళ్లకూరు వెంకన్న హుండీ లెక్కింపు



కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కిస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభు వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో గువారం స్వామివారి హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా 127 రోజులకుగాను స్వామి వారి హుండీ లెక్కించగా రూ.19,36,321 వచ్చాయని కార్య నిర్వహణ అధికారి మోకా అరుణ్ కుమార్, తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి పండిత విల్లూరు సమూహ దేవాలయాల కార్య నిర్వహణ అధికారి దండు వెంకట కృష్ణంరాజు సమక్షంలో హుండీ తెరిచి, లెక్కించామని తెలిపారు.

రహదారి నిర్మాణానికి భూమి పూజ



బొండాడలో సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

కాళ్ల: బొండాడలో స్మశానానికి వెళ్లే రహదారి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా కాళ్ల మండలం బొండాడలో సీసీ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ మన్నే నాగరాజు, మండపాటి కృష్ణమూర్తి, మేక వెంకన్న బాబు, ఫణి, గొర్ల లక్ష్మణ్,తేజ,శివాజీ,నాని,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ జాతర



పట్టణంలో అమ్మవారి ఊరేగింపు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం నాచువారి సెంటర్‌లో కనకదుర్గమ్మ అమ్మవారి 31వ వార్షిక మహోత్సవంలో భాగంగా అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం ఒంటెద్దు బళ్ళ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం డప్పుల వాయిద్యాలతో గరగల నృత్యాలతో ప్రత్యేకంగా అలంకరణ చేసిన అమ్మవారిని ఊరేగించారు. పట్టణ వీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బీఎస్ఐ మండల కార్యవర్గాల ఎంపిక



సమావేశంలో బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఉండి: బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) 5 మండలాలకు నూతన కార్యవర్గాలను ఎంపిక చేసినట్లు నియోజకవర్గ అధ్యక్షుడు రెవరెండ్ ఈలి డేవిడ్‌మార్క్ తెలిపారు. గురువారం చెరుకువాడ చర్చ్ ఆఫ్ క్రైస్ట్ చర్చ్‌లో 5 మండలాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్‌మార్క్ మాట్లాడుతూ బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియాపై దాతృత్వం కలిగి ఎంతో మంది విస్తారంగా కానుకలు ఇచ్చారన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

పెర్కిపాలెంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

వీరవాసరం: మండలంలోని పెర్కిపాలెం గ్రామంలో చాలా కాలంగా తాగేందుకు మంచినీరు లేక ప్రజలు పడుతున్న అవస్థలను పంచాయతీ అధికారులు గుర్తించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. పెర్కి పాలెం సీపీఎం గ్రామ శాఖ మహాసభ బొక్క మంగారావు అధ్యక్షతన జరిగింది. ముందుగా పార్టీ జెండాను తోట నరసింహారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ గ్రామంలో చాలాకాలంగా తాగేందుకు స్వచ్ఛమైన మంచినీరు లేక ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం సరిగాలేక రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తోందన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

రహదారులు ఇలా.. ప్రయాణం ఎలా?

- అడుగడుగునా గోతులతో ప్రమాదాలు
- అవస్థలు పడుతున్న వాహనదారులు



రోడ్డుపై నీరు నిలిచి పోవడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



శృంగవృక్షం రైల్వే గేటు సమీపంలో చెరువును తలపిస్తున్న జాతీయ రహదారి

భీమవరం: నిత్యం కురుస్తున్న భారీ వర్షాలతో రోడ్లపై నీరు నిలిచిపోతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణీకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది స్వార్థంతో రోడ్డుకు ఇరువైపులా ఎత్తుగా చేయడంతో వీధుల్లోని రోడ్లేగాకుండా జాతీయ రహదారిపైన కూడా వర్షం నీరు గంటల తరబడి నిలిచిపోతుంది. ప్రధానంగా భీమవరం నుంచి పాలకొల్లు వైపు వెళ్లే జాతీయ రహదారిపై భీమవరం పట్టణంలోని పోలీసుబొమ్మసెంటర్, విస్సాకోడేరు వంతెనకు సమీపంలోని పెట్రోల్ బంకు సమీపంలోను, శృంగవృక్షం రైల్వేగేటు వద్ద రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోతుంది. దీనికితోడు కొంతమంది నివాసాల్లోని వాడకం నీరు సైతం రోడ్డుపైకి రావడంతో రోడ్డు తొందరంగా దెబ్బతిని పెద్ద పెద్దగోతులు పడుతున్నాయి. ఇటీవల కాలంలో ఒకేసారి భారీవర్షం కురువడంతో పల్లపు ప్రాంతాలతోపాటు రోడ్లు జలమయమై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గంటల తరబడి నీరు నిలిచిపోవడంతో వేగంగా వచ్చే పెద్ద వాహనాలు మోటారుసైకిలిస్టులు, పాదచారులుపై నీరు వెదజల్లడంతో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు వెంబడి ఇరువైపులా ఉన్న షాపులు, గృహాల యజమానులు మెరక చేయడంతో భీమవరం పట్టణంలో రోడ్డుపై వర్షనీరు తొందరగా పారడం లేదు. అసలే అంతంతమాత్రంగా డ్రెయినేజీ వ్యవస్థ ఉండడం డ్రెయినేజీలోని పూడిక సక్రమంగా తొలగించకపోవడంతో వర్షం నీరు పారడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకోడేరు, వీరవాసరం, పాలకొల్లు మండలాల్లోని గ్రామాల్లో రోడ్డు వెంబడి ఉన్న షాపులు, గృహాల యజమానులు రోడ్డుకు ఇరువైపులా మెరక చేయడంతో నీరు బయటకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. దీనితో రోడ్డుపైనే నీరు నిలిచిపోవడంతో రోడ్డు దెబ్బతిని పెద్ద పెద్ద గోతులు పడుతున్నాయి. దీంతో ప్రయాణీకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా జాతీయరహదారి, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వెంబడి మెరకను తొలగించి వర్ష నీరు పారేందుకు కచ్చా డ్రెయిన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

కాళ్ల: కాళ్లకూరులో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ దాట్ల వెంకట రామరాజు గురువారం తెలిపారు. ఆకివీడు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, భీమవరం విష్ణు దంత వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ వైద్య శిబిరంలో కంటి, దంత వైద్యం ఉచితంగా అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రొఫెసర్ వర్మకు అభినందనలు



ప్రొఫెసర్ వర్మను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యుఎస్) ఎడ్యుకేటర్ ఎక్సలెన్స్ అవార్డు భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ పి.రవి కిరణ్ వర్మకు లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ డాక్టర్ వర్మను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికిరణ్ వర్మ మాట్లాడుతూ అమెజాన్ వెబ్ సర్వీసెస్ సంస్థ ప్రతిఏటా వివిధ రంగాలలో నైపుణ్యం కలిగిన విద్యావేత్తలకు అవార్డులు ప్రధానం చేస్తుందన్నారు. అందులో భాగంగా తనకు ఈ అవార్డుతో పాటు బెస్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కోఆర్డినేటర్ అవార్డు కూడా లభించింది అన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు మాట్లాడుతూ తమ కళాశాలకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసిటిఈ) ఎడ్యు స్కిల్స్ ఇంటర్న్ షిప్ సమావేశంలో తమ కళాశాలకు జాతీయ స్థాయిలో 33 వ ర్యాంకు అవార్డు ప్రకటించిందని పేర్కొన్నారు. ప్రధానంగా విద్యార్థులకు వివిధ కార్పొరేట్ సంస్థల ద్వారా ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ కోర్సులు అందించి విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడినందుకుగాను ఏఐసీటిఈ చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ ఈ అవార్డు తమ కళాశాలకు అందించారని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో జాతీయస్థాయిలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో 100 కళాశాలలకు స్థానం కల్పించగా అందులో తమ కళాశాలను కూడా చేర్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ ఆర్ కె నిశాంత్ వర్మ మాట్లాడుతూ తమ కళాశాలకు ఏఐసిటిఈ ద్వారా జాతీయ స్థాయి అవార్డులు తీసుకు వచ్చినందుకు కళాశాల సిబ్బందిని అభినందించారు.

భారీ అన్న సమారాధన



అన్న సమారాధనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశం చౌక్): అమ్మవారి అన్నదాన ప్రసాదం వితరణ గొప్ప దైవ కార్యక్రమం అని మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మెంటేవారితోటలోని బాలాత్రిపుర సుందరి దేవి అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి వేడుకలు ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని మాజీ విప్ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసర మహోత్సవాలను ఘనంగా నిర్వహించి చివరి రోజు భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధి రవితేజ, తోట భోగయ్య, నందమూరి ఆంజనేయులు, మద్దాల సత్యనారాయణ, సాయిబాబా, లీలా, తాతారావు, సమతం తాతాజీ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అటవీ మొక్కలకు క్రాఫ్ కటింగ్



మొక్కలకు క్రాఫ్ కటింగ్ చేస్తున్న అటవీ సిబ్బంది

ఆకివీడు: అటవీ జాతి మియా వాకీ అటవీ మొక్కలను, తురాయి, కదంబం, బాదం మొక్కలను మండలంలోని పెదకాపవరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గత ఐదేళ్లగా పెంచుతున్నారు. మరుగుకు ఉపయోగపడే విధంగా దుబ్బుగా, దట్టంగా ఎదిగే ఈ మొక్కలకు గురువారం చింతలపూడి అటవీ శాఖ నుంచి వచ్చిన 15 మంది అటవీ సిబ్బంది క్రాఫ్ కటింగ్ చేశారు. అటవీ జాతి మొక్కలు కావడంతో ఇతరులు మొక్కలపై చేతులు వేసే అవకాశం లేదు. ఈ మొక్కలను తుంచినా, పీకివేసినా, తొలగించినా అటవీ చట్టం ప్రకారం కేసులు పెట్టే అవకాశం ఉంది. పాఠశాల సమీపంలో శ్మశాన భూమి ఉంది. శ్మశానంలో శవ దహన సంస్కారాలు విద్యార్థులకు కన్పించకుండా ఉండేందుకు ఈ మొక్కలను గత ప్రభుత్వ ఓఎస్‌డీ కె.వెంకట కృష్ణారావు అటవీ ప్రాంతం నుంచి రప్పించి, నాటించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా మొక్కలను పెంచారు. విపరీతంగా ఎదగడంతో వాటికి క్రాఫ్ కటింగ్ అవసరం ఏర్పడటంతో అటవీ సిబ్బందిని పిలిపించి పనులు చేయించామని ఇన్‌చార్జి హెచ్ఎం బలరామ్ చెప్పారు. క్రాఫ్ కటింగ్ పనులను గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి కేశవరావు పర్యవేక్షించారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల ధర్నా



డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

భీమవరం: మున్సిపల్ ఉపాధ్యాయులపై అనేక నిరసనలు తెలియజేసినప్పటికీ ఇంతవరకు వారి సమస్యలు అలాగే ఉన్నాయని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బి.గోపి మూర్తి అన్నారు. జిల్లా డీఈవో కార్యాలయం ముందు మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు 117 జీవో రద్దు చేసి ప్రమోషన్లు బదిలీలు ఇవ్వాలని, వారు దాచుకున్న పీఎఫ్ సొమ్మును వెంటనే వారికి చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ సీనియర్ ప్రధానోపాధ్యాయులకు మున్సిపాలిటీలో ఉన్న డిఐ పోస్టుకు ప్రమోషన్ కల్పించాలన్నారు. ప్రభుత్వాలు మారిన వారి సమస్యలు అలాగే ఉన్నాయని వెంటనే సమస్యలు పరిష్కరించుకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టి డైరెక్టరేట్‌ను ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏకేవీ రామభద్రం, విజయరామరాజు, కే రాజశేఖర్, కడలి వెంకటేశ్వరరావు గూడూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రీసర్వే గ్రామసభలు

పాలకోడేరు: మండలంలో రీసర్వే పూర్తయిన 12 రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణరాజు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభలు నవంబర్ 2 వరకు నిర్వహిస్తామన్నారు. గ్రామ స్థాయిలో భూమికి సంబంధించిన రీసర్వే సమయంలో తలెత్తిన సమస్యలు పరిష్కరించేందుకు ఈ సదస్సులు ఉపయోగపడతాయన్నారు. గ్రామ సభల్లో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 18న కొండేపూడి, వేండ్ర అగ్రహారంలోనూ, 19న గొరగనమూడిలోనూ, 22న పెన్నాడ అగ్రహారంలోనూ, 23న విస్సాకోడేరులోనూ, 24న వేండ్రలోనూ, 25న గరగపర్రులోనూ, 26న గొల్లలకోడేరులోనూ, 29న కోరుకొల్లు లోనూ, 30న మోగల్లులోనూ, నవంబర్ 2న పాలకోడేరు మండల కేంద్రంలోనూ ఈ గ్రామసభలు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్పొరేషన్‌తో స్వర్ణకారులకు లబ్ధి

ఆకివీడు: ఏపీ స్వర్ణకార వెల్ఫేర్, అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేయడంతో స్వర్ణకారుల జీవితాల్లో వెలుగు నింపినట్లు అవుతుందని స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు పట్నాల శేషగిరిరావు చెప్పారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా స్వర్ణకార వృత్తిలోని కుటుంబాలకు మేలు జరుగుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం ఏఎస్ఆర్ నగర్ లోని 33/11కె వి ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రము పరిధిలో 11 కె వి చినఅమిరం ఫీడర్ పై చెట్లు, కొమ్మలు, తొలగించుట కొరకు 18వ తేది శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 (ఒంటిగంట) వరకు రాయలం బైపాస్ రోడ్ ఏరియా లోని కొన్ని ప్రాంతాలకు చినఅమిరం గ్రామానికి పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. అదే విధంగా పెదగరువు విద్యుత్ ఉపకేంద్రము పరిధిలో 11కె.వి బేతపూడి ఫీడర్ పై చెట్లు, కొమ్మలు తొలగించుట కొరకు శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1(ఒంటిగంట) వరకు చినగరువు, దిరుసుమర్రు, పల్లిపాలెం, పాతూరు, తూర్పుగూడెం, శివాలయం సెంటర్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వంద రోజుల సంబరాలు సిగ్గుచేటు



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

భీమవరం: ఉచిత ఇసుక హామీని అమలు చేయకపోయినా, నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయలేకపోయినా వంద రోజుల్లో మంచి పాలన అందించామంటూ కూటమి ప్రభుత్వం సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని సీపీఎం నేత ఎం.వైకుంఠరావు విమర్శించారు. పట్టణంలోని చినరంగనిపాలెంలో సీపీఎం శాఖ సమావేశం పార్టీ నేత సీహెచ్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా వైకుంఠరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి హామీని అమలు చేయకుండా వంద రోజులు సంబరాలు చేసుకోవడం సిగ్గుపడాలని ఆయన అన్నారు. రానున్న కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాలని అన్నారు. అనంతరం నూతన కార్యదర్శిగా అన్యం రాంబాబుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో మద్దాలరాంబాబు, విరత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

పొలం డాక్యుమెంట్స్ పోయినవి

[illegible] కిషోర్ S/o [illegible] 27-17-71 JLB [illegible] ASR నగర్ [illegible] 1232/1964 [illegible] 314/5A [illegible] 1235/1984 డాక్యుమెంట్ లో 314/5A 50 సెంట్లు, 314/5B 5 సెంట్లు పొలం డాక్యుమెంట్స్ [illegible] భీమవరం [illegible] పోయినవి. [illegible]

ఆదర్శప్రాయుడు ఆదికవి వాల్మీకి



భీమవరంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో మహర్షి వాల్మీకి జయంతి నిర్వహిస్తున్న దృశ్యం



వాల్మీకి జయంతి సందర్భంగా ఆర్ఆర్‌డీఎస్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



వాల్మీకి జీవిత చరిత్రపై పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేసిన దృశ్యం

భీమవరం: రామాయణాన్ని రాసి ధర్మస్థాపన గావించి శ్రీరాముడు లోకాంత పురుషుడిగా చాటిన ఆదికవి వాల్మీకి నేటి సాహిత్య లోకానికి ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు కొనియాడారు. డాక్టర్ వై.ఎస్.ఆర్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెజిఆర్ఎల్ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ దాయన సురేష్ చంద్రాజీ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి రామాయణం, ఇతిహాసాలను చదివి విజ్ఞానాన్ని, నైతిక విలువలను నేర్చుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి (ఇంచార్జ్) ఎస్.వెంకటేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాల్మీకి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తరాలు మారినా అంతరాలు పెరిగినా ఇప్పటికీ భారతీయులందరినీ ఐక్యం చేసి ఒక జాతిగా తీర్చిదిద్దిన ఆదికవి వాల్మీకి మహర్షి అని డాక్టర్ వి.కె.జె ప్రసూన తెలిపారు. ముందుగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి భారతీయ విలువలను ఆచరిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్.లక్ష్మీ కాంతం, కాకుమాని శ్రీనివాసరావు, జి.ఉమా మహేశ్వరి, పి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

రామాయణాన్ని రచించి భారతావనికి అందించిన మహనీయుడు వాల్మీకి అని రిటైర్డ్ సబ్ కలెక్టర్ ఆకుల కృష్ణారావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బీవీ రాజు పార్క్‌లో వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. కృష్ణారావు మాట్లాడుతూ వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, హైందవ ధర్మాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ చదివి అర్థం చేసుకోవలసిన ఇతిహాసం రామాయణమన్నారు. తెలుగు ఉపాధ్యాయులు జీడిగుంట సునీత, అరసవల్లి సుబ్రమణ్యం, రామాయణం చిన్నారి, కట్రెడ్డి చరణ్ పాల్గొన్నారు.

విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లకు శిక్షణ



విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఉండి: చేపలు, రొయ్యల సాగులో సంభవించే వ్యాధులు, వైరస్‌ల పట్ల రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లిఖార్జునరావు అన్నారు. విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లకు గురువారం కేవీకేలో చేపలు, రొయ్యల సాగులో సంక్రమించే వ్యాధులు, యాజమాన్య పద్ధతులపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ జిల్లాలో వరి సాగు తరువాత స్థానం రొయ్యలు, చేపలదే కనుక సాగులో గ్రామ ఫిషరీస్ అసిస్టెంట్ల పాత్ర కీలకమన్నారు. మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం చేపలసాగులో ఎక్కువగా రెడ్ డిసీజ్ (చేపలు ఎర్రబడే వ్యాధి) సోకుతుందన్నారు. వెంకట్రామన్నగూడెం కేవీకే మత్స్యశాస్త్రవేత్త డాక్టర్ దేవీ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం రొయ్యల్లో తెల్లమచ్చ వైరస్ వ్యాధి, ఈహెచ్‌పీ వ్యాధులకు ఏవిధమైన మందులు లేవని తెలిపారు. చెరువుల్లో నీటిని నింపే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

ఆకివీడు: ప్రాణం పోయాకా రోడ్లకున్న గుంతలు పూడుస్తారా అంటూ వినియోగదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి నెం.165లో ఉండి రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పడిన గుంతలపై గురువారం ఆయన తీవ్రంగా స్పందించారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జాతీయ రహదారి అధికారులు ఉన్నట్లా, లేనట్లా అని ప్రశ్నించారు. ఆర్వోబీ పనులు పునఃప్రారంభించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. లోపాలను సరిజేసి పనులు చేయాల్సిన అధికారులు పుష్కర కాలమైనా ఆర్వోబీ పూర్తికాకపోవడం దారుణమన్నారు. ఈ ప్రాంతంలో రహదారిపై ప్రయాణం నరకాన్ని చూపిస్తుందన్నారు. ఆదమరిస్తే అనంత లోకాలకు వెళ్లాల్సిందేనని వాపోయారు. తక్షణం రోడ్డు మరమ్మతులు చేపట్టి, ఆకివీడు, ఉండి, భీమవరం ప్రాంతాల్లో గుంతలను పూడ్చి రోడ్డుపై నిలబడిన వర్షపు ముంపునీటిని తొలగించకపోతే జాతీయ రహదారుల శాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తామని, పట్టించుకోకపోతే వినియోగదారుల ఫోరంలో కేసు వేస్తామని బంగారయ్య హెచ్చరించారు. జిల్లాకు చెందిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తక్షణం జాతీయ రహదారిపై స్పందించి ఆ శాఖ అధికారులను మేలుకొల్పాలని బంగారయ్య విజ్ఞప్తి చేశారు.

12వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
12 సంలుగా భీమవరం మరియు పరిసర ప్రాంత ప్రజలకు విశేష సేవలు అందించడానికి మరియు అగ్రస్థానంలో ఉండటానికి అనుక్షణం మా వెన్నంటే ఉండి ప్రోత్సహిస్తున్న మా మిత్రులు శ్రేయోభిలాషులందరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు
సూర్యచంద్రాస్
డా॥ సంజీవ్ హోమియోకేర్
మల్టీ స్పెషాలిటీ హోమియో హాస్పిటల్
టౌన్ రైల్వేస్టేషన్ రోడ్, జ్ఞానానంద కంటి ఆసుపత్రి ఎదురుగా, భీమవరం -2
ఫోన్: 08816-235758, సెల్: 94 94 56 58 58



డా॥ సత్య సంజీవ్ చిక్కం
B.H.M.S., M.D. (Homeo)
Reg. No. 6859

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమవరం డివిజన్
90102 23729
79955 66351
90108 51166
Office mail : tpgadvt@gmail.com